



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 26 ఫిబ్రవరి 2026 పేజీలు : 04


# రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రికి పరిటాల సునీత విజ్ఞప్తులు

- శ్రీ సత్యసాయి జిల్లా నేతల సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- పలువురు మంత్రులకు కూడా ఎమ్మెల్యే సునీత వినతులు
- పేరూరు ప్రాజెక్ట్, బంగారు గనులతో పాటు పలు ప్రాజెక్టులపై వినతి
- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, మంత్రులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గంలోని కీలకమైన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు పలువురు మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి పత్రాలు అందజేశారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన సమీక్షా సమావేశం నిర్వహించగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ప్రత్యేకంగా కొన్ని అంశాలు తీసుకెళ్లారు. ఇందులో ప్రధానంగా జీడిపల్లి పేరూరు పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం, రాక్రీట్ సంస్థ చేసిన అక్రమాలు, హంద్రీనీవా ప్రాజెక్టు ఫేస్2, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1లక్ష 3వేల 362ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ డీపీఆర్ కు నిధులు, రేమాండ్స్ పరిశ్రమ ఏర్పాటు వేగవంతం చేయడం వంటివి ఉన్నాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో 4వేల ఎకరాల బీడు భూములలో హార్టికల్చర్ హబ్ లేక సోలార్ హబ్ ఏర్పాటు, గోరు చిక్కుడు పరిశ్రమ కోసం నిర్మించిన భవనాల్లో ఇతర పరిశ్రమలు ఏర్పాటు, రామగిరి బంగారు గనులను మళ్లీ ప్రారంభించడం వంటి వాటిపై విన్నవించారు. వీటితో పాటు నడిమివంకకు రక్షణ గోడ, ఆత్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలు, పంపనూరు, పండమేరు దేవాలయాల వద్ద పార్కులు, కనీస సౌకర్యాలకు నిధులు కేటాయించాలన్న అంశాలు ఉన్నాయి.

**మంత్రులకు కూడా పలు అంశాలపై విజ్ఞప్తులు :**

బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురు మంత్రులను కలిసి నియోజకవర్గంలో సమస్యలు, అభివృద్ధిపై వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిసి త్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు రూ.2.80 కోట్లు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి రామగిరిలో ఎస్ఐ, 12 స్టాఫ్ క్వార్టర్స్ అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే మరమ్మతులు అవసరమైన 3కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణిని కలిసి నియోజక వర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయి. మరికొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పిల్లలు, సిబ్బంది అవసరాలు, సౌకర్యాల దృష్ట్యా వీటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. మరోవైపు పశు సంవర్థకశాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి అనేక వెటర్నరీ డిస్పెన్సరీలు, గ్రామీణ పశువుల యూనిట్లు, పశు పశువైద్య ఆసుపత్రులు శిథిలావస్థలో ఉన్నాయని వివరించారు. వాటి వివరాలు అందజేసి.. అక్కడ కొత్త భవనాలు నిర్మించి, తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి నసనకోట ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.50లక్షలు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 30 గ్రామాలలో భజన మందిరాలు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని కోరారు. ఎమ్మెల్యే సునీత వినతులపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. అన్నింటినీ పరిశీలించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.






# సత్యసాయి జిల్లా అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి

**- జిల్లా సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**పుట్టపర్తి టౌన్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని ఆ జిల్లా ఇన్చార్జి మంత్రి తోపాటు జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా కలెక్టర్,ఎస్పీ, ఎమ్మెల్యేలు, ఎంపీ తో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసంలో మంగళవారం రాత్రి జరిగిన సత్యసాయి జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మంత్రులకు ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్ ,ఎస్పీ లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. సత్యసాయి జిల్లా పండ్ల తోటల అభివృద్ధికి, పరిశ్రమలతో పాటు ఐటీ రంగానికి ఎంతో అనుకూలమైన ప్రాంతం అన్నారు. అంతేకాకుండా కర్ణాటక ఐటీ రాజధాని బెంగళూరుకు అత్యంత సమీపంలో సత్యసాయి జిల్లా ఉండడంవల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతం వాణిజ్య కేంద్రంగా తయారవుతుందని తెలిపారు. సత్యసాయి జిల్లాలో ని పెనుగొండ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయికి చెందిన కియా లాంటి కార్ల పరిశ్రమ రాకతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మరెన్నో అనుబంధ పరిశ్రమలు ,ఇతర ఉత్పత్తి రంగ సంస్థలు ఈ ప్రాంతానికి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. మడకశిర లో డిఫెన్స్ అకాడమీ,పుట్టపర్తి ప్రాంతంలో రిలయన్స్ సోలార్ పరిశ్రమతో పాటు మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చాయన్నారు. పర్యాటక రంగంగా పెనుగొండను తీర్చిదిద్దుతామన్నారు. మరి ముఖ్యంగా హిందూపురాన్నీ పారిశ్రామిక రంగంగా లేపాక్షిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు.

కదిరి ప్రాంతంలో ఎన్ పి కుంట ప్రాంతంలో ఎన్టీపిసి భారీ సోలార్ ప్రాజెక్టు తోపాటు మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు, రాప్తాడు నియోజకవర్గంలో సోలార్ ప్రాజెక్టుతో పాటు మరిన్ని పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో చేనేత పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమలు ఏర్పాటుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యచరణ పై ముఖ్యమంత్రి జిల్లా అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీతో విస్తృతంగా చర్చించారు.

# క్రీడల్లో రాణించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**- ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 క్రీడా పోటీల్లో పలువురు ఎమ్మెల్యేలు**





**అనంతపురం, ఫిబ్రవరి 25, (ప్రభాత వార్తా బ్యూరో)**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం శాప్ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 2026 శాసన సభ్యుల క్రీడా పోటీల్లో పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఎంతో ఉత్సాహంగా , ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి పలు క్రీడల్లో ఎమ్మెల్యే పల్లె సిందూర విజయం వైపు దూసుకెళు_న్నారు. బుధవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు జిల్లాకు చెందిన పరిటాల సునీత ,శ్రావణి ,సత్య కుమార్ యాదవ్, తదితరులు పలు క్రీడల్లో ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు. పల్లా శ్రీనివాస్ సత్యకుమార్ యాదవ్ టీం మధ్య క్రికెట్ పోటీ జరగ్గా ఈ మ్యాచ్ ప్రత్యేక అతిథులుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఎమ్మెల్యేలు పరిటాల సునీత ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లు బ్యాట్ పట్టి ఒక బాల్ ఆడి ఇలా ఆడాలని మిగతా జట్టు సభ్యులకు సూచించారు. త్రో బాల్ పోటీలు పరిటాల సునీత వర్సెస్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి టీమ్ తలపడ్డాయి. ఈ పోటీల్లో పరిటాల సునీత టీం విన్నర్ గా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి టీం రన్నర్ గా నిలిచారు.టెన్నికాయిట్ సింగిల్ పోటీలో ఎమ్మెల్యేలు సింధూర రెడ్డి మరియు ఎమ్మెల్యే పరిటాల సునీత మధ్య జరిగాయి.ఈ పోటీలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి గెలుపొందారు. టెన్నికాయిట్ డబుల్స్ లో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,విజయశ్రీ మరియు జగదీశ్వరి ,పద్మశ్రీ మధ్య జరిగిన టెన్నిస్ కాట్లో పల్లె సింధూర రెడ్డి,విజయశ్రీ రన్నర్ గా నిలిచారు. షటిల్ లో.. పల్లె సింధూర రెడ్డి వర్సెస్ కావలి గ్రీష్మ మధ్య షటిల్ పోటీ ఆసక్తికరంగా సాగింది. ఈ పోటీలో కావలి గ్రీష్మ విన్నర్ గా పల్లె సింధూర రెడ్డి రన్నర్ గా నిలిచారు.బ్యాడ్మింటన్ పోటీల్లో పల్లె సింధూర రెడ్డి వర్సెస్ కర్రి పద్మశ్రీ మధ్య ఎంతో ఉత్కంఠ పోరు సాగింది. ఇందులో కర్రీ పద్మశ్రీ విన్నర్ గా పల్లె సింధూర రెడ్డి నిలిచారు.

# పెనుకొండలో అభివృద్ధి పాలనా అనుమతులకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత వినతి



సీఎం చంద్రబాబునాయుడుతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు.

**పెనుకొండ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

నియోజక వర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని కేవలం 20 నెలల కాలంలో చేపట్టడం జరిగిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ ఏడాది కూడా అదే జోరుతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామణి, దీనిలో భాగంగా పెనుకొండలో రూ.116.65 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబునాయుడును కోరుతూ మంత్రి సవిత వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధిపై టీడీపీకి చెందిన జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్,మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెస్ రాజులతో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహిం చారు. జిల్లాలో గత నెలల 20 కాలంలో చేపట్టిన అభివృద్ధితో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపైనా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత. పెనుకొండ నియోజక వర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. రూ.116.65 కోట్లతో చేపట్టబోయే 12 అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. రూ.4.63 కోట్లతో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ఫేజ్ IIలో ఛాలకూరు ఎంఐ ట్యాంక్, కాస్కేడింగ్ ట్యాంకులకు ఆఫ్‌టేక్, తిరువెంకటనాథ చెరువు, కోగిరా ట్యాంకులకు ఫీడర్ ఛానెల్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాలతో 2,450 ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడంతో పాటు 50వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఈ పనులకు సంబంధించి డీపీఆర్ సైతం ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు. రూ.14.93 కోట్లతో పెన్నా నది పై నారానాగేపల్లి గ్రామం వద్ద సబ్‌సర్ఫేస్ డ్యామ్, రూ.14.54 కోట్లతో పెన్నా నది పై పెద్ద మంతూరు గ్రామం వద్ద సబ్‌సర్ఫేస్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ.70 లక్షలతో గోరంట్ల మండలంలో గ్రామీణ కోటాలో కొత్త అన్నా కాంటీన్ మంజూరు చేయాలని ఆ వినతపత్రంలో మంత్రి సవిత కోరారు. రూ.2.50 కోట్లతో రొద్దం జూనియర్ కళాశాలలో ట్రైబ్ల్.జు హాస్టల్ మంజూరు చేయాలన్నారు. 71 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మించి, వంద శాతం మేర కుళాయి కనెక్షన్లు అందివ్వడానికి రూ.21.35 కోట్లు వ్యయమవుతుందన్నారు. ఈ పనులకు కూడా అనుమతివ్వాలని సీఎం చంద్రబాబును మంత్రి సవిత కోరారు. కియా పరిశ్రమ విస్తరణతో పెనుకొండ నగర పంచాయతీలో జనాభా విస్తరిస్తోందని, పంచాయతీలో పారిశుధ్యం మెరుగుదలకు కొత్తగా సీసీ డ్రైన్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఇందుకోసం రూ.10 కోట్లు వ్యయం కానుందన్నారు. నియోజక వర్గంలో లో వోల్టేజ్, ఓవర్‌లోడ్ సమస్యల పరిష్కారానికి రూ.18 కోట్లతో నాలుగు కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రైతులకు మేలు కలిగేలా సాగు కోసం త్వరిగతగిన 383 కొత్త డీటీఆర్ లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలతో నియోజక వర్గంలో అంతర్గత సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ. 20 కోట్లు అవసరమన్నారు. రూ.10 కోట్లతో నియోజక వర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీ గోడలు, కిచన్ షెడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. పెనుకొండలోని సీహెచ్సీ ఆసుపత్రిని వంద పడకల ఏరియా హాస్పిటల్ గే అప్ గ్రేడ్ చేయాల్సి ఉందన్నారు. ఇలా నియోజక వర్గంలో చేపట్టబోయే 12 అభివృద్ధి పనులకు రూ.116.65 కోట్ల నిధులు అవసరమని, ఇందుకు పాలనా అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని మంత్రి సవిత కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధుల తో పాటు అధికారులు పాల్గొన్నారు.

# జైన చరిత్రకు చెదలు

- శిలావస్థలో 13వ శతాబ్దం నాటి జైన ఆలయం
- ఆలయ పునరుద్ధరణకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- కనుమరుగుతున్న చారిత్రక వైభవం
- ప్రభుత్వ జాబితాలో కొనసాగుతున్న ఆలయం కంపచెట్ల మధ్య దర్శనం





ఆలయం శిథిలావస్థకు చేరుకోకముందు (ఫైల్), ఇన్ సెట్ లో తీర్థంకరల శిల్పం, జైన ఆలయ ముఖ ద్వారం

**కంబదూరు, ఫిబ్రవరి 25, ప్రభాత వార్త**

కంబదూరు మండల కేంద్రంలో 13 వ శతాబ్దం కాలం నాటి నిర్మితమైన ప్రాచీన జైన ఆలయం ప్రస్తుతం కంప చెట్ల నడుమ శిథిలావస్థలో దర్శనమిస్తోంది. పురావస్తు శాఖ నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం వల్ల చారిత్రక జైన కట్టడానికి చెదలు పడుతోంది. శైవాలయం సమీపంలోనే జైన ఆలయ నిర్మాణం ఉండటం ఆ ప్రాంతంలో ఒకప్పుడు విభిన్న మతాల సామరస్యాన్ని సూచిస్తున్నదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. గర్భాలయ ముక ద్వారానికి ఇరువైపులా తీర్థంకరుల శిల్పాలు , రాతి నిర్మాణ శైలి ఆధారంగా ఈ ఆలయం శతాబ్దాల నాటి నిర్మాణమైన జైన ఆలయం ఉండవచ్చని పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నారు.అయితే కాలగమనంలో నిర్లక్ష్యం కారణంగా ఆలయ గోడలు కూలిపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఆలయం కాలగర్భంలో కలిసిపోయే స్థితిలో ఉంది. కంబదూరులోని జైన ఆలయం శిథిలావస్థకు చేరుకొని ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం పట్ల ఆలయ పునరుద్ధరణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రాచీన చరిత్రను భావితరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు శిథిలావస్థలో ఉన్న ఆలయాలకు నిధులు కేటాయించకపోవడంతో ఇలాంటి ఎన్నో ఆలయాలు కనుమరుగవుతున్నాయి. ఈ ఆలయం పురావాస్తు శాఖ జాబితాలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జైన ఆలయ సమీపంలో పురావస్తు శాఖ అధికారులు పరిశోధనలు చేపడితే మరిన్ని చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆ ప్రాంతపు ప్రాచీన భౌగోళిక పరిస్థితులు, వాణిజ్య మార్గాలు, మతపరమైన పరిణామాలు వంటి అంశాలపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉందని వారు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న జైన స్మారక చిహ్నాల్లో ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు కలదు. పూర్వ జైన ఋషులు ఇక్కడ ధ్యానం చేశారని వినికిడి. కావున కంబదూరులోని ఈ పురాతన జైన క్షేత్రాన్ని రక్షించి, పూర్వ వైభవం తేవాలని చరిత్రకారులు, స్థానికులు పురావస్తు శాఖను డిమాండ్ చేస్తున్నారు. అలనాటి జైనుల చరిత్రకు ఈ ఆలయం ఓ సాక్ష్యం అని చరిత్రకారులు చెబుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పురావస్తు శాఖ శాఖ అధికారులు స్పందించి ఆలయ పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, గ్రామస్తులు కోరుతున్నారు.జిల్లా పురావస్తు శాఖ ఏడి, స్వామి నాయక్‌శిథిలావస్థకు చేరుకున్న కంబదూరు జైన ఆలయాన్ని పునరుద్ధరించేందుకు నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ఆలయానికి పునరుద్ధరణ పనులు చేపడుతాం. జైన సంఘాల దృష్టికి కూడా తీసుకెళ్లి ఆలయాన్ని అభివృద్ధికి కృషి చేస్తాం.

శిథిలావస్థలో ఉన్న ఆలయం, గర్భాలయంలో చెట్లు పెరిగిన దృశ్యం



# మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తన

**-ఫోక్సో కేసులో నిందితుడికి 4 ఏళ్ల జైలు శిక్ష**

**శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా శింగనమల మండలం చిన్న మట్ల గొంది గ్రామానికి చెందిన ముత్యాల సంపత్ (29) ఓ మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానం 4 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.4,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అదేవిధంగా బాధితురాలికి రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**కేసు వివరాలు :**

2020 జూన్ 01 తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలో ముత్యాల సంపత్ అనేయువకుడు ఓ 15 సంవత్సరాల మైనర్ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండగా నీళ్లు అడగడం పేరుతో ఇంట్లోకి ప్రవేశించాడు. బాలిక నీళ్లు తీసుకురావడానికి లోపలికి వెళ్లిన సమయంలో నిందితుడు తలుపులు మూసి, గడియ పెట్టి ఆమెపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అరవడానికి ప్రయత్నించగా, నోరు మూసి చంపుతానని బెదిరించాడు. అనంతరం బాలిక అతని నుండి తప్పించుకుని బయటకు వచ్చి జరిగిన విషయాన్ని తన పిన్నమ్మకు తెలిపింది. వారి తల్లిదండ్రులు కూలి పనుల నుండి ఇంటికి చేరుకున్న తర్వాత అదే రోజు శింగనమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సింగనమల పిఎస్‌లో సిఆర్ నెంబర్ 137/2020, యు/ఎస్ 354(ఎ), 506 ఐపిసి, సెక్షన్ 7 ఆర్/డబ్ల్యూ 8 ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్‌హెచ్ఓ రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ఎస్‌హెచ్ఓ మస్తాన్ గౌరవ ఫోక్సో ప్రత్యేక సెషన్స్ న్యాయస్థానం, అనంతపురంలో చార్జ్ షీట్ దాఖలు చేశారు.

**కోర్టు తీర్పు:** అనంతపురం జిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు ఈ కేసులో మొత్తం 7 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో 25.02.2026న నిందితుడికి 4 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.4,000 జరిమానా విధించారు. అదనంగా బాధితురాలికి రూ.50,000 పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పి.పి ఎస్. లక్ష్మినారాయణ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

**పోలీసు అధికారుల కృషి:**

అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సిఐ ఎస్.విజయ భాస్కర్ గౌడ్, శింగనమల ఎస్ఐ విజయ్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ ఎం. శ్రీనివాసులు, కానిస్టేబుల్ బి.రామమోహన్, శింగనమల ప్రాసెస్ పిసి సి.గంగాధర్ సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరు పరచి, నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేశారు. వీరిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి

మడకశిర టౌన్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి పేర్కొన్నారు. బుధవారం మడకశిర పట్టణంలో భారీ జనసంద్రమున స్థానిక గిరిజన నాయకులు గిరిజన నేతలతో కలిసి మధుగిరి రోడ్డు లోని సంత్ సేవాలాల్ మహారాజు విగ్రహానికి భూమి పూజ చేసి స్థానిక లంబాడా బంజారా సోదరులతో కలిసి ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి,ఎస్టి కమిషన్ సభ్యులు వెంకటప్పలకు మహిళలు అడుగడుగునా స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలతో సాయిబాబా ఆలయం ఆవరణము వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం భారీ బహిరంగ సభకు అతిరథ మహారతులు గోర్ బంజారా నాయకులు సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కమిటీ సభ్యుడు వెంకటప్పలు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షలు కేటాయించిం దన్నారు. రాష్ట్రంలో గిరిజన తండాలకు రోడ్లు మౌలిక వసతులు ఇతర అవసరా లకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ గిరిజనులకు ఏమైనా సమస్య వస్తే 24/7 ఏపీ ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని తెలియజేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ చూపిన మార్గం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు. కార్యదర్శి శ్రీనివాసమూర్తి.నాగరాజు. చక్రి నాయ క్వెంకటేష్ నాయక్.లక్ష్మీనారాయణ. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి రాష్ట్రసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్. రాష్ట్ర అధ్యక్షులు లోక్యానాయక్. రాష్ట్ర వక్కలిగ చైర్మన్ లక్ష్మీనారాయణ.మాజీ సర్పంచ్ చంద్రప్ప మాజీ మంత్రి నర్సే గౌడ్. వైసిపి పార్టీ సమన్వయకర్త ఈరలకప్ప. హిందూపురం బిజెపి నాయకురాలు లక్ష్మీబాయి. మడకశిర నియోజకవర్గ సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నవోదయ విద్యాలయాన్ని తనిఖీ చేసిన పిఎంశ్రీ పాఠశాలల అబ్జర్వర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఎంశ్రీ పాఠశాలల అబ్జర్వర్

లేపాక్షి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయాన్ని బుధవారం పిఎంశ్రీ పాఠశాలల జిల్లా పరిశీలకులు సచితానందప్రసాద్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలో డిఈఓ కిష్టప్ప, ఎంఈఓ నాగరాజు, ప్రిన్సిపాల్ నాగరాజులతో విద్యాలయ స్థితిగతులపై సమీక్షించారు. అనంతరం, సైన్స్, ల్యాబరేటరీలను పరిశీలించారు. అందులో ఉన్న పలు పరిశోధన పరికరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డిజిటల్ తరగతులు చూచి ఏఐ తరగతులు జరుగుతున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైనింగ్ హాల్, వంటగదులను పరిశీలించి మరింత శుభ్రతగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠ్యాంశాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని సబ్జెక్టుల్లో తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా అని పిల్లలతో ఆరా తీశారు. విద్యార్థులు కూడా విద్యపై శ్రద్ధ కనబరచాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, ఎన్‌సిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై కూడా శ్రద్ధ కనబరచాలని సూచిం చారు. విద్యాలయాల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆధునిక పద్ధతుల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని ఆయన వారికి సూచించారు.

# ఫార్మర్ రిజిస్టర్‌లో రైతులు పేర్లు నమోదు చేసుకోండి

అగళి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ఫార్మర్ రిజిస్ట్రీ, ఏపీ ఎయిమ్స్ యాప్, ఉబరైజేషన్,పైన అవగాహన కార్యక్రమం హుళ్ళికేరా దేవరహళ్ళి, ఇరిగేపల్లి, రావుడి ఇనగాలూరు గ్రామాలలో ఫార్మర్ రిజిస్ట్రీ మరియు యూరియా వాడకం, ఈ పంట నమోదు, ఏపీ ఎయిమ్స్, ఉబరైజషన్ గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. మండలంలో దాదాపు పదివేల మంది రైతులు ఉంటే ఇప్పటిదాకా 5175 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవడం జరిగిందని, అలాగే పిఎం కిసాన్ లబ్ధి పొందుతూ ఇంకా ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు 1000కి పైగా మంది ఉన్నారని వారందరూ కూడా అర్హత ఉన్నట్లయితే వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పెండింగ్ ఉన్న రైతుల వివరాలు రైతు సేవా కేంద్రం దగ్గర అందుబాటులో ఉన్నాయని, మిగతా భూమి ఉన్న ప్రతి రైతు కూడా రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వాళ్ళ పట్టాదారు పాసుపుస్తకం, 1బి, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకి లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉండే ఫోన్ తీసుకొని వెళ్లి ఆధార్ ఓటిపి లేదా బయోమెట్రిక్ ద్వారా కానీ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నట్లయితే రైతుకు 11 సంఖ్యలు ఉన్నటువంటి విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది ఇది రాబోయే రోజులలో పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పడాలన్నా మరియు రైతులకు సంబంధించినటువంటి ఎరువులు,విత్తనాలు, పంట నమోదు, యంత్ర పరికరాలు బ్యాంకు ఋణాలు, మరియు అన్ని రకాల రైతుల ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందాలంటే ఇది కచ్చితంగా ఉండాలి కాబట్టి పెండింగ్ ఉన్న రైతులందరూ కూడా త్వరగా నమోదు చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుండి జనసేన సభ్యత్వ నమోదుకు సిద్ధంకండి

- రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద కృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ దనుంజ

అమరాపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

రాష్ట్రంలో నేటి నుంచి మార్చి 10వతేది వరకు జనసేనాని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ జనసేన నాయకుడు ఆనంద్ కృష్ణ, అమరాపురం సింగిల్ విండో అధ్యక్షుడు జనసేన నాయకుడు డాక్టర్ ధనుంజయ, మండల జనసేన ప్రధాన కార్యదర్శి శివరం శివకుమార్ తదితరులు తెలిపారు.సేనసిద్ధం కండి,జనసైనికునిభద్రతజనసేన బాధ్యత అనే నినాదంతో జనసేనపార్టీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ముఖ్యంగా జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత మరియు సేవా గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఉద్యమి, సాధక్ ,ప్రదాత గా సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమంలో జనసేన సైనికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# అదృశ్యమైన బాలుడు




రామగిరి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండలంలోని పేరూరు గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం నుంచి కనిపించలేదని రామగిరి పోలీసులకు ఫిర్యాదు అందింది. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చాకలి భరత్ పాఠశాలలో కార్యక్రమం జరుపుకుంటుండగా ఇదే అదునుగా భావించిన భరత్ పాఠశాల నుంచి తప్పించుకుని వెళ్లాడు. ఈ విద్యార్థి స్వగ్రామం అనంతపురం. బుధవారం ఉదయం అనంతపురంలోని వారి ఇంటి సమీపంలో ఓ కొట్టు వద్ద బజ్జీలు తింటూ కనిపించడంతో ఆ బాలుడిని గుర్తించిన స్థానికులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించేలోపే కనబడకుండా పోయినట్టు తెలసింది. పేరూరు గురుకుల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కూడా విద్యార్థి ఆచూకి కోసం గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వెలగమేకలపల్లికి 1 కోటి 48 లక్షల

# రోడ్డు భూమి పూజ చేసిన కూటమి నేతలు



భూమి పూజ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

సోమందేపల్లి ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండలంలోని వెలగ మేకలపల్లి గ్రామానికి మోక్షం కలిగింది, 40 ఏళ్లుగా రోడ్డు లేని గ్రామానికి మంత్రి సవిత రోడ్డు మంజూరు చేయించారు అన్నారు కూటమి నేతలు, మండలం వెలగమేకలపల్లి కి బుధవారం నూతన బి టీ రోడ్డుకు భూమి పూజ చేసారు కూటమి నేతలు,కన్వీనర్ వెంకటేష్, రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, హిందూపురం పార్లమెంటు తెదేపా కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గుత్తేదారు ధనుంజయ నాయుడు భూమి పూజ చేసారు, అనంతరం నేతలు మాట్లాడుతూ గత ఎన్నికలలో వెలగమేకలపల్లికి ప్రచారానికి వచ్చిన మంత్రి సవిత ఆనాడు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మాట ప్రకారమే నూతన బి టీ రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 48.5 లక్షలు మంజూరు చేసారన్నారు, 40 ఏళ్లుగా రోడ్డు లేక గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, నేటితో వారి కష్టాలు తీరయానన్నారు, గత పాలకులు అభివృద్ధి చేయకుండా కేవలం ప్రగల్భాలు పలికారని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం అంత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది అన్నారు, మంత్రి సవిత అసెంబ్లీ లో ఉన్న కూడా పెనుకొండ నియోజకవర్గం పై ఎపుడు దృష్టిలో పెట్టుకుని అహర్నిశలు పని చేస్తున్నారని, మంత్రి సవిత ఆదేశాలతో ఈ భూమి పూజ చేశామని, ప్రతి చోట ఏదో ఒక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అన్నారు నేతలు,అదే విధంగా వెలగమేకలపల్లి లో త్రాగు నీటి సమస్య తీర్చేందుకు 20 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కూడా మంత్రి సవిత నాంది పలికారని, త్వరలో ఓవర్ హెడ్ ట్యాంకు ని ప్రారంభిస్తాం అన్నారు కూటమి నేతలు, ఈ కార్యక్రమం సోమందేపల్లి డిప్యుటీ ఎంపీడీఓ ప్రేమ్ కుమార్,లో మాజీ మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, చల్లపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ, శరత్ చంద్ర,రంగప్ప, రామిరెడ్డి, పందిపర్తి శ్రీనివాసరెడ్డి, వెలగమేకలపల్లి నరసింహులు, శివశంకర యాదవ్,జేసీబీ రంగా, డీలర్ బాలు,గట్టు మహేంద్ర, జనసేన నాగరాజు, మహిళా నాయకురాళ్లు అనసూయ, సుధారాణి, కూటమి నేతలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం

- ఎంపిడిఓ కమలాబాయి




గోరంట్ల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

గోరంట్ల మండల వ్యాప్తంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై నిర్వహించిన 19వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు మండల ఎంపిడిఓ కమలాబాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 12 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు మండల వ్యాప్తంగా నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను వివరిస్తా రన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన వివిధ పథకాల పనులపై గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు 19వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ఈ నెల 26వతేదీ గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్య క్రమానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

# విశ్వకర్మయోజన పథకం లబ్ధిదారులకు వాషింగ్ మిషన్‌ల పంపిణి



వాషింగ్ మిషన్ లను పంపిణి చేస్తున్న దృశ్యం

పరిగి ఫిబ్రవరి 25(ప్రభాత వార్త):

సత్యసాయి జిల్లా పరిగి మండలం కోడిగినహళ్లిలో పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద 17 మంది రజక లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ యోజన రా ష్ట్ర కో కన్వీనర్ బంగారు చంద్ర, బిజెపి జిల్లా కార్యదర్శి నీరుగంటి వేణుగోపాల్, మాజీ మండల అధ్యక్షులు బద్రీనాథ్, బాబు ప్రసాద్, గణేష్, బాలు మరియు పోస్టల్ డిపార్ట్మెంట్ సిబ్బంది హర్ష గంగాధర్ మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హెల్మెట్, సీటుబెల్ట్ తోనే ప్రయాణం సురక్షితం

- రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి..

- 55 మంది హెల్మెట్లు లేని , ద్విచక్ర వాహనాల దారులకు హెల్మెట్లు కొనుగోలు చేయించిన సీఐ బోయ శేఖర్



హెల్మెట్ల అవగాహన కార్యక్రమంలో సిఐ.

గోరంట్ల ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆ దేశాల మేరకు, డీఎస్పీ నర్సింగప్ప సూచనల మేరకు బుధవారం సీఐ బోయ శేఖర్ బెంగళూరు హైదరాబాద్ జాతీయ రహదారిలోని పాలసముద్రం క్రాస్ వద్ద రోడ్డుపై ప్రత్యేక వాహన తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్యంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా సీఐ బోయ శేఖర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు,కార్లు నడిపే వాహనదారులకు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపితే జరిగే ప్రమాదాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో స్పష్టంగా తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా వాహన దారులకు హెల్మెట్లు లేని 55 మందికి తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,హెల్మెట్లు కొనుగోలు చేయించారు, తప్పకుండా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని వాహన దారులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రాణ రక్షణకే హెల్మెట్ ఉపయోగ పడుతుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు రామచంద్రయ్య, నిర్మల, హిందూపురం ఏఎంవిఐ బాగ్యశ్రీతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు

- అసిస్టెంట్ జి సి డి వో అనిత

కనగానపల్లి ఫిబ్రవరి 25, ప్రభాతవార్త



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ జ సి డి ఓ అనిత

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు బుధవా అసిస్టెంట్ జి సి డి ఓ అనిత మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థునులను భోజనం రుచిగాను శుచిగా ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. అసిస్టెంట్ జిసిడిఓ అనిత మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థునులకు నాణ్యమైన ఆహారం అందించాలని లేకుంటే చర్యలు తప్పవని ప్రిన్సిపాల్ నరసమ్మ కు సూచించారు. అనంతరం ఉపాధ్యాయునులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థునుల పరీక్షల గురించి మరియు 100 రోజుల ప్రణాళిక అమలు విధానంపై ఉపాధ్యాయునులను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయునులు రమా దేవి, రాజేశ్వరి,ఎంఆర్‌సీ.ఎం.ఐస్ కోఆర్డినేటర్ హెచ్.రామన్న పాల్గొన్నారు.

# సభ్యత్వం లేకుండా నామినేటెడ్ పదవులు లభించవు




సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

జనసేన పార్టీలో సభ్యత్వం లేకుండా ఎలాంటి నామినేటెడ్ పదవులు లభించవని హిందూపురం పార్లమెంట్ జనసేన సమన్వయకర్త షేక్ రియాజ్ పేర్కొన్నారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా జనసేన పార్టీ ఉద్యమి జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం సన్నాహ సభ పుట్టపర్తిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆహుడా చైర్మన్ టిసి వరున్ ,రాష్ట్ర నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్, జనసేన స్టేట్ డైరెక్టర్ మణి ప్రియ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా షేక్ రియాజ్ మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని 26వ తేదీ నుండి ప్రారంభించనుందని పార్టీపై ఎక్కువ మక్కువ ఉన్నవారిని పార్టీలో చేర్చుకొని సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం మా నాయకుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని, అతని కలలు సాకారం చేసేందుకు మనమంతా ఉద్యమించాలన్నారు. నియోజకవర్గ, మండల నాయకుల సమన్వయంతో గడపగడపకు వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గతంలో కంటే రెట్టింపు స్థాయిలో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మండల కన్వీనర్లు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిపై అవగాహన

బుక్కపట్నం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త



క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పి స్తున్న దృశ్యం

క్షయ వ్యాధి వారోత్సవాలు సందర్భంగా బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జానకంపల్లి గ్రామంలో క్షయ వ్యాధిపై సంబంధిత వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న సాయంత్రం పూట జ్వరం వస్తున్న బరువు తగ్గిపోతున్న ఆకలి లేకపోవడం వలన టీబీ పరీక్ష చేసుకోవాలని ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు 60 సంవత్సరాలు పైబడిన వారు పాత క్షయ వ్యాధి రోగులు వారి ఇంటిలోని వారు ధూమపానం ఆల్కహాల్ సేవించువారు మొదలగు వారందరూ టీబి పరీక్ష చేయించుకోవాలన్నారు. గల్ల పరీక్ష వ్యాధి నిర్ధారణ అయితే మందులు ఉచితంగా ఇస్తారనీ, అంతేకాకుండా పౌష్టికాహారం కొరకు ప్రతినెల రోగి యొక్క బ్యాంకు ఖాతాకు ఆరు నెలలపాటు నెలకు రూ.1000 చొప్పున 6000 రూపాయలు వేయనున్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలు కోసం జిల్లా టీబి యూనిట్ సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబి సూపర్వైజర్ అబిద్ భాషా , టి బి హెచ్ వి రాజేశ్వరి, ఆశ వర్కర్లు మాధవి, రాధాలు అవగాహన కల్పించడం జరిగింది

# పరిటాల శ్రీరామ్‌కు సన్మానం



పరిటాల శ్రీరామ్ ను సన్మానిస్తున్న జానగాని, చిల్లవారు, గుడికట్టు కాపులు

ధర్మవరంటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లికాటకోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరిగేలా సహకరించిన నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ ను జానగాని, చిల్లవారు. గుడికట్టుకాపులు సన్మానించారు. ఈ మేరకు అనంత పురం క్యాంపు కార్యాలయంలో కాటకోటేశ్వరస్వామి ఆలయ పూజారులు కాటమయ్య,బుధవారంబాలస్వామి,బొట్టుకిష్టతో పాటు ధర్మవరంటీడీపీ నాయకులు మద్దిలేటి, జింకలరాజన్న, వంట రమేష్,తదితరులు పరిటాలశ్రీరామ్ ను కలిసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కొన్ని సంవత్సరాలుగా మహాశివరాత్రి సందర్భంగా జరిగే కాటకోటేశ్వరస్వామి ఉత్సవాలలో ఎటువంటి సమస్యలు, గొడవలు జరగకుండా ఇరువర్గాలతో చర్చించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పరిటాల శ్రీరామ్ సహకరించారని ఆలయపూజారులు పేర్కొన్నారు.

# కెజిబివి పాఠశాలలను తనిఖీ చేసిన అసిస్టెంట్ డిసిటిఓ



ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్న అసిస్టెంట్ డిసిటిఓ

రామగిరి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

రామగిరి, కనగానపల్లి మండలాల్లోని కెజిబివి పాఠశాలలను అసిస్టెంట్ డిసిటిఓ అనిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు సంబంధించి 100 రోజుల ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో జరిగిన పాఠ్యాంశాలు విద్యార్థుల బోధనాంశాల గురించి తెలుసుకున్నారు. రామగిరి ఎస్ఓ స్వర్ణలత, కనగానపల్లి ఎస్ఓ నరసమ్మ, పాఠశాలల వివరాలు, పనితీరు గురించి తెలుసుకున్నారు.

# త్వరితగతిన అనుమతులు మంజూరు చేయండి

- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

పరిశ్రమల స్థాపనకు కావాల్సిన వివిధ శాఖల అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా స్థాయి పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐపిసి) సమీక్షా సమావేశం జరిగింది. 2024 పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న 12 ఒప్పందాల (ఎం ఓ యు ల) పురోగతిని సమీక్షించారు. వాటికి భూ కేటాయింపులు, అనుమతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెట్టుబడి రాయితీ కింద 16 పరిశ్రమలకు, వడ్డీ రాయితీ కింద ఒక పరిశ్రమకు రాయితీలను మంజూరు చేశారు. ఏపీ ఎం ఎస్ ఎం ఈ కింద జరుగుతున్న పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. పీఎం ఈజీపి, పి ఎం విశ్వకర్మ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంకర్లు త్వరగా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణ కుమార్, డి ఐ సి జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెవీ డ్రైవింగ్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ



హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లను అందిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి (కలెక్టరేట్), ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

జిల్లా కలెక్టరేట్ లోఎస్.సి. కార్పొరేషన్ , ఏపీఎస్ ఆర్టీసీ హిందూపురం డిపో సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అభ్యర్థులకు బుధవారం జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా హెవీ డ్రైవింగ్ సర్టిఫికెట్ల ను పంపిణీ చేశారు. .ఎస్.సి. కార్పొరేషన్ ఆర్థిక సహాయంతో జిల్లాలోని 10 మంది నిరుద్యోగ యువతకు హిందూపురం ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ వాహనాల డ్రైవింగ్ లో ప్రత్యేక శిక్షణ కల్పించారు. ఈ శిక్షణ కోసం ప్రభుత్వం ఒక్కో అభ్యర్థికి రూ. 20,000/ చొప్పున అందించి , వారికి నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాన్ని కల్పించింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి. కార్పొరేషన్ ఈడీ యం.కుముద, ఆర్టీసీ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కాలువల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- రీసర్వేను వేగవంతం చేయండి

పెనుకొండ ఆర్డిఓ ఆనంద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

గోరంట్ల ఫిబ్రవరి 25 ప్రభాత వార్త

ప్రభుత్వం భూ రికార్డులను ప్రక్షాళన చేయడంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే భాగంగా రెవెన్యూ సర్వే సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలని పెనుగొండ ఆర్డిఓ ఆనంద్ కుమార్ తెలిపారు, ఈ సందర్భంగా బుధవారం గోరంట్ల తాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి సిబ్బందితో సమీక్షించారు, ఏ గ్రామ పంచాయతీలు నిర్వహిస్తున్నారు ఇప్పటివరకు ఎంతమంది రైతుల ఎల్పీ నెంబర్లు సిద్ధం చేశారు, పట్టాదార్ పాస్ పుస్తకాలు ఎంతమందికి పంపిణీ చేశారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు, అలాగే తాసిల్దార్ కార్యాలయంలోని రికార్డులను మరియు కంప్యూటర్ రికార్డులను పరిశీలించారు, అలాగే మండల పరిషత్ కార్యాలయం సిబ్బందిని పిలిపించి సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని శాఖల వారీగా పథకాల వారీగా సమీక్షించారు, అలాగే ఆర్డబ్ల్యూఎస్ ఇరిగేషన్ అధికారులతో చిత్రావతి మరియు చెరువు కాలువల ఆక్రమణలపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదులు అందాయని దానిపై ఇంతవరకు పరిశీలన కార్యక్రమాలు చేపట్టి చర్ల చేపట్టారని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు, కార్యక్రమంలో మండల సర్వేయరు తాతయ్య, రెవెన్యూ మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీశ్వేతార్క వరసిద్ధి వినాయక విగ్రహాల ఊరేగింపు

నేడు పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం

ధర్మవరంటౌన్ , ఫిబ్రవరి 25 ప్రభాతవార్త



వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పట్టణంలోని రాజేంద్రనగర్ లో శ్రీశ్వేతార్క వరసిద్ధి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళ వాయిద్యాల మధ్య అంగరంగవైభవంగా పునఃప్రతిష్ఠాపన చేసే విగ్రహాలను బుధవారం ఊరేగించారు. వరసిద్ధి వినాయక ఆలయంలో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు ఆలయ అభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ప్రాతఃకాల పూజ, తిరుమంజనము, లక్ష్మీనారాయణ హోమం, రుద్రహోమం, ఆంజనేయ స్వామి హోమం. శయ్యాది వాసము, పుష్పాధివాసము, సుబ్రమణ్యేశ్వర హోమం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం వినాయక విగ్రహాన్ని కోలాటం నడమ ఊరేగించారు. గురువారం వినాయక విగ్రహ పునః ప్రతిష్ఠాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు పేర్కొన్నారు.



కోలాటం ఆడుతున్న దృశ్యం

03ATP25_03ATP25.qxd 26-02-2026 AM 12:03 Page 1



## జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా మన శంకర్ వరప్రసాద్ గారు ప్రసారం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మన శంకర వరప్రసాద్ గారు మళ్లీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనుంది. హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ హై యాక్షన్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ థియేట్రికల్ రన్‌లో భారీ వసూళ్లు సాధించి, విస్తృత ప్రశంసలు అందుకుంది. మన శంకర వరప్రసాద్ గారు గ్రాండ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఫిబ్రవరి 28, శనివారం సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో.. తప్పక చూడండి! ఈ ఏడాది సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన మన శంకర వరప్రసాద్ గారు ఫిబ్రవరి 11 నుంచి డిజిటల్ ప్లాట్‌ఫాం జీ5 వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మితా కొణిదెల సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి శంకర వరప్రసాద్ పాత్రలో కనిపించగా, నయనతార, వెంకటేష్ దగ్గుబాటి మరో కీలక పాత్రల్లో నటించారు. భీమ్స్ సెసిరోలియో సంగీతం, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్‌తో ఈ సినిమా మరింత ఆకర్షణీయంగా మారింది. హృదయస్పర్శక కుటుంబ భావాలు, నవ్వులు పూయించే కామెడీ, థ్రిల్లింగ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆత్మీయ ప్రదర్శనలతో అన్ని వయసుల ప్రేక్షకులకు పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీగా నిలిచింది. డిజిటల్ వేదికపై కూడా సెన్సేషన్ సృష్టించిన ఈ చిత్రం జీ5లో సంచలనాత్మకంగా 500 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలను సాధించి ప్రేక్షకాదరణను మరింతగా చాటుకుంది. మెగా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ మన శంకర వరప్రసాద్ గారు సినిమాని జీ5, జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూసేయండి.

## అభ్యుదయ రచయిత సింగమనేని

అనంతపురం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త బ్యూరో

ప్రముఖ కథా నవలా రచయిత సింగమనేని నారాయణ గారి 5వ, వర్ధంతి సందర్భంగా స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు.

అనంతపురం రైతు జీవితాన్ని సాహిత్యం ద్వారా సుసంపన్నం చేసిన అనంత కథా సేద్యగాడు సింగమనేని నారాయణ అని మానవత రక్తదాత సంస్థ కన్వీనర్ తరిమెల అమర్నాథ్ రెడ్డి కొనియాడారు. జీవితంలోనూ సాహిత్యంలోను విలువలతో బ్రతికిన గొప్ప విమర్శకుడు సింగమనేని నారాయణ అనే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర ప్రసంగించారు. విశాలాంధ్ర బుక్ హౌస్ విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న ప్రసంగిస్తూ విశాలాంధ్ర బుక్ హౌస్ అభివృద్ధికి సింగమనేని ఎంతగానో కృషి చేశారని, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటోరియల్ సభ్యులుగా చివరి వరకు ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మానవత తరిమెల కన్వీనర్ తరిమెల అమరనాథ్ రెడ్డి, సలీం భాష, డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, విశాలాంధ్ర బుక్ హౌస్ విశ్రాంత మేనేజర్లు చెట్ల ఈరన్న, జయరాములు, కవులు డాక్టర్ జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్, విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్ తదితరులు హాజరై నివాళులర్పించారు.



దివంగత సింగమనేని నారాయణకు నివాళులర్పిస్తున్న సాయి సంస్థల ప్రతినిధులు

## ఎస్టియు సమర శంఖంను విజయవంతం చేద్దాం

### - ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధపు రామాంజనేయులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ఈనెల 25న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆర్థికపరమైన అంశాలు అయిన 12వ వేతన కమిషన్ ఏర్పాటు చేయాలి. 30మధ్యంతర భృతి ప్రకటన. పెండింగ్ డిఎలు తక్షణ మంజూరు. సిపిఎస్ రద్దు ఓపిఎస్ అమలు. పదవీ విరమణ అనంతరం సాలభ్యాలు వెంటనే మంజూరు చేయాలి. మెమో నంబర్ 57 ను అమలు చేయాలి. తదితరు అంశాల పైన చలో విజయవాడ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దాదాపుగా పదివేల మందికి హాజరై విజయవంతం చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించకపోతే భవిష్యత్తులో కుటుంబాలతో సహా రోడ్లపైకి వచ్చి నిరసన చేపడుతామని తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర నాయకులు సూర్యుడు కృష్ణమూర్తి, రాజశేఖర్, ఫణి భూషణ్, జిల్లా నాయకులు సుధాకర్, నాగభూషణ బాబ్జి నాయక్, పెద్దన్న మల్లికార్జున, ఆదినారాయణ, శ్రీనివాసులు, రామ కృష్ణ దాదాపు అనంతపురం జిల్లా నుండి 400కు పైగా పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్టియు నేతలు

## ముగిసిన ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల మండల విద్యాశాఖ అధికారుల శిక్షణ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం, సత్య సాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల మండల విద్యాశాఖ అధికారులకు, ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల డైట్ అధ్యాపకులకు రెండు రోజులుగా జరుగుతున్నటువంటి కెపాసిటీ బిల్డింగ్, గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమం అందరూ మండల విద్యాశాఖ అధికారులకు సమగ్ర అవగాహన కల్పించటంతో ముగిసింది.

స్థానిక కొర్రపాడు లోని రీజినల్ ట్రైనింగ్ సెంటర్ నందు అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎంఈఓలకు, బుక్కపట్నం డైట్ అధ్యాపకులకు అలాగే స్థానిక బుక్కరాయసముద్రం విజయభారతి బిఈడి కళాశాలలో కర్నూల్, నంద్యాల ఎంఈఓ లకు, కర్నూలు జిల్లా డైట్ అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో అనంతపురం, పెనుగొండ ఉప విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, జాన్ రెడ్డప్ప, కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ సమగ్ర శిక్ష ఏఎంఓ వేణుగోపాల్ సీఎంఓ చంద్రశేఖర్, అలెస్కో రామచంద్ర, అసిస్టెంట్ ఏఎంఓలు నారాయణస్వామి, ఫణి రాజు, హెడ్మాస్టర్ రామాంజనేయులు, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ముగిసిన అనంతరం ఉపాధ్యాయులు

## ఎస్కే యూనివర్సిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కిరణ్, ఉమామహేష్ ఎన్నిక

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఏఐఎస్ ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్య దర్శి కుల్లాయి స్వామి హాజరయ్యారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. యూనివర్సిటీ నూతన అధ్యక్షులుగా కిరణ్, ఉపాధ్యక్షులుగా సూర్య, ధనుంజయ, అర్జున్, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేష్, సహాయ కార్యదర్శులుగా దీపిక, మంజు, రాజు, కోశాధికారిగా రాహుల్ వీరితో పాటు 13 మంది కార్యవర్గ సభ్యులు 23 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఏఐ ఎస్ ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్య దర్శి కుల్లాయి స్వామి తెలిపారు. యూనివర్సిటీ నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన సిపిఐ జిల్లా నాయకత్వానికి ఏఐ ఎస్ఎఫ్ జిల్లా నాయకత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



కిరణ్



ఉమా మహేష్

## కోరం లేక నేటికీ మండల సర్వ సభ్య సమావేశం వాయిదా..!

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వ సభ్య సమావేశం కోరం లేక గురువారంకు వాయిదా వేసినట్లు ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోరంకు 1/3 ఉండాల్సిన నలుగురు ఎంపిటిసిలు మాత్రమే హాజరు కావడంతో వాయిదా పడ్డట్లు ఆయన తెలిపారు. నేడు నిర్వహించే మండల సర్వ సభ్య సమావేశానికి మండల పరిధిలోని ప్రాదేశిక సభ్యులు, మండల ప్రాదేశిక అధ్యక్షురాలు సర్పంచులు, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, తహశీల్దారు శేషారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ, నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, టిడిపి మండల కన్వీనర్ గోర ఒట్ల మారుతినాయుడు, గుమ్మేపల్లి సర్పంచు దేగల లలితమ్మ, వెస్ట్ నర్సాపురం సర్పంచు వెంకట రాముడు, తరిమెల సర్పంచు, సలకం చెరువు సర్పంచు ఆదినారాయణరెడ్డి, శింగనమల-2 ఎంపిటిసి ఉమ, ఉల్లికల్లు ఎంపిటిసి రఘునాథరెడ్డి, సోదనపల్లి ఎంపిటిసి, మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్, హార్టికల్చర్ అధికారి శైలజా, ఏపిఎం భాగ్యలక్ష్మి, పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్, డిప్యూటీ ఎంపిడిఓలు విజయ్ కుమార్, అక్బర్ వలి, ఫారెస్ట్ అధికారి, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్



హాజరైన అధికారులు ప్రజా ప్రతినిధులు

## క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఏపి అసెంబ్లీ క్రీడా మహోత్సవం, ఆట విడుపు లో సహచర ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులందరూ కలిసి ఒక కుటుంబంలా ఆడుకోవడం మంచి అనుభూతిని ఇస్తుందని తెలిపారు.



విక్టరీ సింబల్ చూపుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



రింగు విసురుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

## సైనిక్ స్కూల్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించిన డైరెక్టర్లు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

బెంగళూరు నిర్వహించిన కిత్తూరు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన జి.ప్రణవి, సి.దీక్షిత, కె.లస్య, జి.సింధు, వై.చర్విరెడ్డి, డి.సమీహా, యస్.యువిక, కె.ఋషి సాహితి, కె.జయనిత్య, డి.విధుషా, యస్.బరషియా, టి.ర్యూన్సీ, యం.దర్శిక, పి.జ్ఞానికలను రఘు సైనిక్ స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురు ప్రసాద్ హృదయపూర్వకంగా అభినందించారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం మరియు పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తూ, వారికి తమ శుభాకాంక్షలను తెలిపారు. రఘు సైనిక్ స్కూల్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉండి, పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణం అందిస్తున్నదని వారు తెలిపారు.



ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్

## 6వ తరగతిలో ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 12న పరీక్ష

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరమునకు 6వ తరగతిలో చేర్చుకోవడానికై ఏప్రిల్ 12న ఆదివారం అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు తెలిపారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు పని చేస్తున్నాయో ఆ పాఠశాలలో ఉదయం 10:00 నుంచి 12:00 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని తెలిపారు.

## మినర్వా పాఠశాలలో నయనానంద భరితంగా వీడ్కోలు సభ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

స్థానిక అశోక్ నగర్లఓని మినర్వా పాఠశాలలో 10వ తరగతి పూర్తి కాబోతున్న విద్యార్థులకు వీడ్కోలు సభ ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ పరీక్షల భయం తొలగడానికి అనేక సూచనలు తెలియజేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు మెలగవలసిన రీతిని స్పష్టంగా వివరించారు. ప్రశ్న పత్రంలో సమాధానాలు రాయవలసిన పద్ధతిని వివరించారు. ఓఎంఆర్ షీట్ ను సమాధాన పత్రాలను పూరించడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు.



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి

## పయ్యావుల శ్రీనివాసులు చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కూడేరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని పి నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీనుగా వినయ్ అనే అబ్బాయి ప్రమాదముశాతు రోడ్డు ప్రమాదం లో తీవ్ర గాయాల కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన నాగి రెడ్డిపల్లి గ్రామ నివాసి మీనుగా వినయ్ అనే అబ్బాయికి తెదేపా నేత పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ బుధవారం అనంతపురంలోని ఆయన స్వగృహం నందు రూ.40వేలు చెక్ పయ్యావుల శ్రీనివాసులు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కూడేరు మండల ప్రధాన కార్యదర్శి గుండా శివయ్య, ఓబులేసు, హరి నాగిరెడ్డిపల్లి అంబేద్కర్ కాలనీ నాయకులు హరి, రవి, వేణు, రాజశేఖర్ పయ్యావుల సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాల విక్రయాలపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురము విజిలెన్స్ అండ్ ఎంఫోర్సుమెంట్ ఆఫీసర్ వై బి పి టి ఎ. ప్రసాద్ ఆదేశాల మేరకు, విజిలెన్స్ , ఎన్ఫోర్స్‌మెంట్, ఆహార తనిఖీ అధికారులు 3 బృందాలుగా ఏర్పడి సంయుక్తముగా అనంతపురము పట్టణంలో వివిధ ప్రదేశాలలో విడిగా అమ్ముతున్న పాల విక్రయ కేంద్రాల పై నాణ్యత మరియు కల్తీ పరీక్షల నిమిత్తం తనిఖీలు చేయడం జరిగినది. అనంతపురము పట్టణంలో 5 చోట్ల తనిఖీలు చేసి 10 పాల నమూలనాను సేకరించడం జరిగినది. సదరు నమూనాలు హైదరాబాద్ నందు ఆహార పరీక్షా కేంద్రానికి తదుపరి నాణ్యత , కల్తీ నిర్ధారణ కొరకు పంపబడినది. ల్యాబ్ నివేదిక వచ్చిన తరువాత సంబందిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసు కొబడును. పాలను కల్తీ చేసినా మరియు నాణ్యత లేకుండా పాల ఉత్పత్తుల ను సరఫరా చేసినవారిపై తగు చట్టపరమయిన కఠిన చర్యలు తీసుకొ నబడు నని హెచ్చరించడమైనది. ఈ తనిఖీలలో సి ఐ లు కె. శ్రీనివాస్, యస్. జమాల్ బాష, ఏవో జే. వాసు ప్రకాష్ , హిమశైల, రాజశేఖర్, డి సి టి ఓ సురేష్ కుమార్, ఎస్సై. నరేంద్ర భూపతి, అసిస్టెంట్ కంట్రోలర్ ఫుడ్ సేఫ్టీ అధికారులు కె. దేవరాజు, తస్లీమా మరియు సిబ్బంది పాల్గొన్నారు.



పాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

## దేశ రక్షణలో వీరమరణం పొందిన సాకే నరేష్‌కు ఘనంగా అంత్యక్రియలు

గార్లదిన్నె, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :

గార్లదిన్నె మండల కేంద్రానికి చెందిన సాకే నరేష్ (27) భారత సైన్యంలో 21 గ్రెనేడియర్స్ విభాగంలో హవిల్దార్‌గా విధులు నిర్వహిస్తూ దేశ రక్షణలో వీరమరణం పొందారు.బుధవారం ఉదయం నరేష్ పార్థివ దేహం స్వగ్రామానికి చేరుకోగా, భారత సైన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం తరఫున గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సైనిక్ వెల్ఫేర్ శాఖ అధికారులు పుష్పగుచ్చాలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. లెఫ్టినెంట్ కల్నల్ రహ్మత్ అలీతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై చివరి వీడ్కోలు పలికారు. వీర సైనికుని కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని సహాయాలు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దేశం కోసం నరేష్ చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు.



వీరమరణం పొందిన సాకే నరేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భావోద్వేగంతో చివరి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

## వైభవంగా ఎర్రి స్వామి తాత ఉట్ల పరస !

రాప్తాడు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

రాప్తాడు మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో వెలసిన ఎర్రిస్వామి తాత పరుస మూడు రోజులుగా వైభవంగా సాగుతోంది. బుధవారం వేకువజామునే ఆలయంలో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయ్యవారిపల్లి కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఉట్ల పరుష ఉత్సాహంగా జరిగింది. ఉట్టి కొట్టేందుకు అయ్యవారిపల్లి, బొమ్మేపర్తి, బుక్కచెర్ల, కాట్నేకాలువ గ్రామాలకు చెందిన యువకులు పోటీ పడ్డారు. కాగా, ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్దే ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా అన్నదానం నిర్వహిస్తూ వచ్చారు. దీంతో గ్రామంలో ఏ ఇంట్లోనూ పొయ్యి వెలిగించలేదు. బుధవారం ప్రసన్నాయపల్లికి చెందిన భూమిరెడ్డి మహానందరెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

**పోటాపోటీగా రాతి దూలం లాగుడు పోటీలు :** ఎర్రిస్వామి తాత పరుష సందర్భంగా బుధవారం ఉదయం ఆలయం వద్ద జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 4 జతల దేశీయ వృషభాలను రైతులు తీసుకు వచ్చారు. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించగా ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన రైతు ఎస్ చెన్నప్ప వృషభాలు ప్రథమ బహుమతి దక్కించుకున్నాయి. అలాగే బళ్లారికి చెందిన వృషభాలు ద్వితీయ స్థానం, చెన్నె కొత్తపల్లి చెందిన వృషభాలు తృతీయ స్థానం, ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన రైతు వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేత వృషభాల యజమానులను బుక్కచెర్ల నల్లపరెడ్డి అయ్యవారిపల్లి చంద్రమోహన్ రెడ్డి నగదు పురస్కారాలతో నిర్వాహకులను సత్కరించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాప్తాడు సీఐ శ్రీ హర్ష ఆధ్వర్యం లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎర్రిస్వామి తాత మూల విరాట్

## కూడేరు సింగల్ విండో సొసైటీ బ్యాంకు చైర్మన్‌గా జయప్రకాష్ గౌడ్ ఎన్నిక

### - తెదేపా సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులను. శ్రీధర్ చౌదరిని కలిసిన చైర్మన్ జయప్రకాష్ గౌడ్

కూడేరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

కూడేరు మండల సహకార సింగల్ విండో సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన శుభ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులను, అలాగే తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిని బుధవారం సింగల్ విండో సొసైటీ బ్యాంకు చైర్మన్ జయప్రకాష్ గౌడ్ కలిసి ఆశీర్వాదములు తీసుకున్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ రామగౌని జయప్రకాష్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పెద్దలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరి ఆశీర్వాదంతో ప్రజలకు సేవ చేస్తామని నిత్యం ప్రజల కోసం, పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడేరు గ్రామ టిడిపి నాయకులు, సర్పంచ్ లలితమ్మ, బాటవెంకటేష్, నారాయణ స్వామి, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, బొమ్మయ్య, గొల్ల వెంకటేష్, ఎద్దుల సుధాకర్, ముత్యాల అక్కలప్ప, అంకె భీమా, రోగన్నాల నాగరాజు, కుక్కపల్లి శంకర, చిన్న ఈశ్వరయ్య, డీలర్ శివ, గండి రామంజి, తదితరులు పాల్గొన్నారు.



పయ్యావుల శ్రీనివాసులను కలిసిన చైర్మన్, తెదేపా నాయకులు



తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిని కలిసిన జయప్రకాష్ గౌడ్

## యజ్ఞంలా జనసేన సభ్యత్వం ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన ఉద్యమి సభ్యత్వ సమన్వయకర్త పసుపులేటి హరిప్రసాద్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, పిఏసి సభ్యులు చిలకం మధుసూదన్ రెడ్డి

అనంతపురం వైద్యం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు.. సిద్ధాంతాలే.. ప్రచారంగా ప్రజల్లోకి వెళ్దామని జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడ చైర్మన్ టి సి వరుణ్ పిలుపునిచ్చారు. జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ ఆధ్వర్యంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు అధ్యక్షతన సోమవారం స్థానిక యాదవ కళ్యాణమండపంలో అనంతపురం పార్లమెంట్ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన ఉద్యమి సభ్యత్వ సమన్వయకర్త పసుపులేటి హరిప్రసాద్, పిఏసి సభ్యులు చిలకం మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీ.సీ.వరుణ్ మాట్లాడుతూ.. ఔత్సాహికులైన యువకులు మహిళలకు పార్టీ సభ్యత్వం ఇద్దామని, రాష్ట్రంలోనే అనంత పార్లమెంటును అగ్రగామిగా నిలిపేందుకు పండుగ వాతావరణంలో యజ్ఞంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిద్దామన్నారు. అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తిని అందుకుని క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా సభ్యత్వ నమోదును జయప్రదం చేద్దామని, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన జనసేన జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ పిలుపునిచ్చారు. రెట్టింపు ఉత్సాహంతో అన్ని నియోజకవర్గాల ఇన్చార్జిలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండలాల అధ్యక్షులు, వీరమహిళలు జనసైనికులు పాల్గొన్నారు. వైసీపీ నుంచి 50 మంది జనసేనలోకి చేరిక.... సింగనమల నియోజకవర్గం ఇన్చార్జి సాకే మురళి ఆధ్వర్యంలో వెంకటాపురం వైసిపి మాజీ సర్పంచ్ తో పాటు 50 మంది వైసీపీ నాయకులు జనసేనలోకి చేరారు. వారికి సాదర స్వాగతం పలుకుతూ పార్టీ కండువాలు వేసి ఆంధ్రప్రదేశ్ హస్తకళ నైపుణ్య అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షులు అహుడ చైర్మన్ టి.సి.వరుణ్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డిలు ఆహ్వానించారు..



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## మాజీ సిఎం జగన్‌ను కలిసిన రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి బుధవారం పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించినట్లు సమాచారం.



జగన్‌ను కలిసిన రమేష్ రెడ్డి

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బాణా నాగేశ్వర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

గుంటూరులో అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన పల్లె నాగభూషణ్‌రెడ్డి, వెంకటశివమ్మ దంపతుల కుమార్తె డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సాయిపవన్‌కళ్యాణ్ వివాహానికి ఆంధ్రప్రదేశ్ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న బాణా నాగేశ్వర్ రెడ్డి

## అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని దీక్షలు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని తాడిపత్రి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, ఏఐటియుసి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జ్యోతిలత, నాగేశ్వరమ్మ, శంకరమ్మ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలేదీక్షలు బుధవారం మూడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాల పెంపు, ఉచిత గ్యాస్ సరఫరా, వేసవికాలంలో మే నెల అంతా సెలవులు ఇవ్వాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలి, తదితర డిమాండ్స్‌పై రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నాగేంద్ర, అబ్రహం, అంగన్‌వాడి హెల్పర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDL. DISTRICT JUDGE ANANTHAPURAMU
I.A.NO:81/2026 ,I.A. No:82/2026, I.A.No:83/2026 in O.S No. 110/2014
Between:
B.Ravi Kumar ...**Petitioner/Plaintiff**
And
Guduputi Ramanjineyulu (died by L.Rs)
G.Narasamma and others ..**Respondents/Defendants**
**Notice to the Respondant No: 4 and 5**
**R4.** G. Umadevi D/o G. Ramanjineyulu,
**R5.** G. Sailaja D/o G. Ramanjineyulu,
Both are residing at D.No. 6-3-241-1, Ramnagar, Anantapuramu Town.
పై నెంబరు కేసులో Respondants అయిన మీ హాజరు నిమిత్తము 10-03-2026వ తేది ఉదయం 10:30 గం లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
**B.Vijaya Kumar.** Advocate,
Ananthapuramu,Cell: 9440286003

## సజావుగా సాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు పరీక్ష జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 298 మంది విద్యార్థులకు గాను 291 మంది హాజరు కాగా 7 మంది గైర్హాజరయ్యారు. అలాగే నారాయణ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 383 మంది విద్యార్థులకు గాను 368 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా సివి రామన్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 479 మంది విద్యార్థులకు గాను 466 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఏడి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 391 మంది విద్యార్థులకు గాను 383 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. యాడికి ఏపి మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రంలో 204 మంది విద్యార్థులకు గాను 196 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. పెద్దపప్పూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 83 మంది విద్యార్థులకు గాను 80 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. తాడిపత్రి పట్టణంలోని పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

సీల్డు కొటేషన్
ప్రకటన తేదీ: 26-02-2026
అనంతపురము జిల్లా ఉరవకొండ మండలం పెన్నహోబిలం గ్రామము నందు వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవస్థానమునకు సంబంధించిన బ్రహ్మా రథమునకు మరమ్మతులు చేయుటకు అనుభవజ్ఞులైన సంస్థలు/వ్యక్తుల నుండి సీల్డు కొటేషన్లు కోరడమైనది. సదరు సీల్డు కొటేషన్లను తేది: 07-03-2026న ఉదయం 10 గంటలకు దేవస్థానము కార్యాలయము నందు ఉంచిన టెండర్ బాక్సు నందు వేయవలయును.
రథం లోపలి చక్రాలు మరమ్మతులు మరియు ప్రధాన బీమ్‌లను కలిపి ముందు భాగంలోని అడ్డ బీమ్ పూర్తిగా మార్చుట, అన్ని ప్రధాన బీమ్‌లను క్లాంపులను మరియు బోల్ట్/వెల్డింగ్ విధానంతో బలంగా అనుసంధానం చేసి బలమైన ఇనుప సెక్షన్ అమర్చుట మరియు ఇతర చిన్న చిన్న అనుసంధాన మరమ్మతులు చేయుట మొదలగునవి. టెండర్ దాఖలు చేయుటకు ముందు టెండరుదారు పరిశీలించుకోవలెను.
మరమ్మత్తులు చేయుటకు కాలపరిమితి: ఆమోదం పొందిన తేదీ నుండి 25 రోజులు లేదా బ్రహ్మోత్సవములు-2026 ప్రారంబపు రోజులోగా ఏది ముందు అయితే అది ప్రాతిపదికన.
ఇట్లు కార్యనిర్వహణ అధికారి, శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానము, పెన్నహోబిలం, ఉరవకొండ మండలం.

